



## పీరీల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవలక్ష్మి



జైనూర్, జూలై 15 : సోమవారం మండలంలోని పవర్ గూడలో జరిగిన పీరీల పండుగ వేడుకల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొన్నారు. పీరీలకు మొక్కులు చెల్లించి అనంతరం వేడుకల్లో పీరీలను మోస్తూ నృత్యాలు చేశారు.

# ఆర్కే 7లో ఉత్పత్తికి అనుమతులిప్పించాలి

- అధికారుల నిర్లక్ష్యం వల్లే గనికి ఇలాంటి పరిస్థితి
- కార్మికులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించిన కార్మిక సంఘాలు

శ్రీరాంపూర్, జూలై 15 : శ్రీరాంపూర్ ఆర్కే 7గనిలోని నార్త్‌లో పారెస్ట్, ఎన్విరాన్మెంట్‌శాఖ ఉత్పత్తికి అనుమతి లేదని, లీజు ఒప్పందం 2020కే పూర్తి అయిందని, గనిని మూసి వేయాలని ఆదేశాలున్నాయని ప్రచారం కార్మికులకు తెలియడంతో ఒక్కసారిగా కార్మికులు ఆందోళనకు గురయ్యారు. 7గనిలో నార్త్‌లో ఉత్పత్తి పనులు చేపట్టరాదని ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్ శాఖ సింగరేణి యాజమాన్యానికి నోటీసు ఇచ్చిందనే విషయం శనివారం 2వ బదిలీ నుంచి ప్రచారంలో ఉంది. దీనిపై స్పష్టమైన వివరాలు అధికారికంగా సింగరేణి యాజమాన్యం కాని, ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్ శాఖ అధికారులు తెలపలేదు. కానీ దీనిపై కార్మిక సంఘాలు తీవ్రంగా స్పందించింది. ఆర్కే 7గనిలో ఉత్పత్తి నిలిపివేతకు ఆదేశాలున్నాయా, అధికారులను ప్రశ్నించినా ఇంతవరకు వారికి కూడా సమాదానం చెప్పలేని పరిస్థితి ఉంది. దీంతో సోమవారం గనిపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, కార్యదర్శి బాజీసైదా, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, టీబీజీకేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్ రెడ్డి, గని ఇన్‌చార్జి రాజూనాయక్, బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, బ్రాంచి ఉపాధ్యక్షుడు ఈశ్వరచారీలు గని పైకి చేరుకొని గనిలో ఉత్పత్తి నిలిచి పోయిందని చెప్పిన దాంట్లో అధికారుల ద్వారా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. 7గనిలోని నార్త్‌లో పారెస్ట్, ఎన్విరాన్మెంట్ శాఖ ఉత్పత్తి నిలిపివేతపై ఎలాంటి ఆదేశాలు లేవని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారని చెప్పారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ఆధ్యక్షుడు సీతారామయ్య కార్పొరేట్ స్థాయిలో సీఎండీతో మాట్లాడారని, గనిలో ఉత్పత్తి నిలిపివేయాలి ఎలాంటి ఆదేశాలు లేవని, ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్ శాఖ అధికా రులతో చర్చలు జరపుతున్నామని త్వరలోనే ల్యాండ్ లీజు అనుమతులు వస్తాయని స్పష్టం చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

ఆర్కే 7గనిలో మరో 20 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయని చెప్పారు.

### అనుమతులకు ఉన్నతాధికారుల కృషి

శ్రీరాంపూర్ ఆర్కే 7గనిలోని నార్త్ ఏరియాలో సోమవారం యథావిధిగా బొగ్గు ఉత్పత్తి పనులు కొనసాగాయి. రోజూవారీగానే కార్మికులు విధులకు హాజరయ్యారు. అధికారులు, సూపర్‌వైజర్లు కార్మికులను విధులకు డిస్ట్రీబ్యూషన్ చేయడం జరిగింది. గనిలోని ఉత్పత్తి నిలిపివేయడం జరుగుతుందని చెప్పిన నార్త్‌లో 7 ఎస్‌డీఎల్ యంత్రాలతో కార్మికులు ఉత్పత్తి పనులు చేపట్టి ఉత్పత్తి సాధించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ రాముడు, మేనేజర్ శ్రీధర్‌లు సింగరేణి ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి ఫ్రోజ్‌ఖాన్, ఫిట్ కార్యదర్శి బేర రవీందర్, హెచ్‌ఎంఎస్ అధికార ప్రతినిధి జీవన్‌జోయెల్, కార్యదర్శి అనిల్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకుల బిరుదు శ్రీనివాస్, గురుమూర్తి, బీఎంఎస్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఏఐటీయూసీ నాయకుల వినతి

నస్పూర్, జూలై 15 : ఆర్కే 7 గనిలో బొగ్గు ఉత్పత్తి చేసుకోవడానికి అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ 2020 నాటికి ఆర్కే 7 మైన్ ల్యాండ్లీస్‌కు అనుమతి ఉందని, దీన్ని ఎక్స్‌టెక్షన్ చేయాలని అటవీ శాఖ అధికారులకు 2018లో యాజమాన్యం లేఖలు పంపిందని, కానీ అటవీ శాఖ అధికారులు ఇప్పటి వరకు అనుమతించలేదన్నారు. వెంటనే ఉత్పత్తికి అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల దాసు, బ్రాంచ్ ఏరియా కార్యదర్శి సారయ్య, అఫ్రోజ్‌ఖాన్, సత్తయ్య, రాజ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమ పరిహారాన్ని నిలిపివేయాలి

కాసిపేట, జూలై 15 : కాసిపేట మండలంలోని పెద్దనపల్లి శివారులో కల్యాణిఖని ఓపెన్ కాస్ట్ కు సంబంధించి భూములకు అక్రమంగా పరిహారం తీసుకునేందుకు కుట్రలు చేస్తున్నారని, దీనిపై విచారణ చేసి నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాసిపేట బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, నాయకులు చింతల సాయి వంశీ మాట్లాడుతూ కాసిపేట మండలంలోని పెద్దనపెల్లి శివారులోని సర్వే నెంబర్ 5లో భూమిని ప్రభుత్వ భూమి కేకే 2 ఓపెన్ కాస్ట్ గనిలో ముంపునకు గురవుతుండగా అదే అనుకూలంగా కొందరు ప్రభుత్వ భూమిని సాగు చేసుకున్నామని నష్టపరిహారం పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది వరకు సైతం ఇదే భూమిని నోటిఫికేషన్ ద్వారా పరిహారం పొందారని, గత సంవత్సరం కూడా పరిహారం కాజేసేందుకు సర్వే నెంబర్ 5/79 పేరిట 16 ఎకరాల భూమిని నోటిఫికేషన్ వేయగా అసలు ఆ భూమిలో 8 ఎకరాలు మించి లేదని ఫిర్యాదులు అందగా పరిహారం నిలిపివేశారన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారులు, కొందరు నాయకులు కుమ్మక్కై పరిహారం పొందే విధంగా కుట్ర చేస్తున్నారని, దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని కోరారు.

## ఉప్పొంగిన వాగులు..కొట్టుకుపోయిన రోడ్లు..

కోటపల్లి, జూలై 15 : మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో కురిసిన భారీ వర్షానికి లోత్వొర్రె వాగు ఉప్పొంగి ప్రవహించడంతో మల్లంపేట-నక్కలపల్లి గ్రామాల మధ్యన లోలెవల్ వంతెన కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.వెంటనే స్పందించిన చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ జేసీబీతో కల్వర్ట్‌పై మట్టి వేయించి రాకపోకలు పునరుద్ధరించారు. మండలంలోని రాజారం-బబ్బెర చెలుక మధ్య వాగు ఉప్పొంగి రోడ్డు కొట్టుకపోయింది.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 15 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరం సమిష్టిగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో సిర్పూర్ పేపర్ మిల్లు లిమిటెడ్-కాగజ్ నగర్ ఆధ్వర్యంలో కళాకారులచే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి కాసబోయిన సురేశ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ సమిష్టిగా నిరోధించాలని, ప్లాస్టిక్ వినియోగం నివారణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా కృషి చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భావితరాలకు జరిగే నష్టాన్ని ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిర్పూర్ పేపర్ మిల్ ప్రతినిధులు రీనా జార్జ్, అశోక్, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్

### జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా జిల్లా అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌లతో కలిసి ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాలలో ముందు ఉంచేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, త్రాగునీరు, ఆహారం తీసుకునే విషయాలలో పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుదీకరణ, మూత్రశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మత్తు పనులను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ప్రతిరోజు నివేదికలు అందించాలని తెలిపారు.

## యూనిట్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 15: మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకంలో యూనిట్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మహిళ శక్తి పథకం యూనిట్లను గుర్తించడంపై సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనే జర్లు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆ దిశగా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనే జర్లు కృషి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో మహిళా సం ఘాలతో సమావేశాలు నిర్వహించి ఔత్సాహిక మహిళా సంఘా లను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు.

## టాస్క్ ఫోర్స్ అధికారులతో విచారణ

జైనూర్, జూలై 15: లింగాపూర్ మండలంలోని లేండిగూడ గ్రామానికి చెందిన ఆదివాసుల నుంచి ఆ ప్రాంతంలో పనిచేసే అటవి శాఖ అధికారులు తమ నుంచి డబ్బులు వాసూలు చేశారని, సంబంధిత బాధిత ఆదివాసి రైతులు ఆదివాసి సంఘాల సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవరావు బాధితులు ఇటీవల కొమరం భీం జిల్లా ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు చేశారు. కుమ్రంభీం,జిల్లా అటవి శాఖ జిల్లా అధికారి తక్షణమే స్పందించి అటవి శాఖ టాస్క్ ఫోర్స్ కమిటితో విచారణ కమిటిని ఆదేశించగా విచారణ కమిటీ టాస్క్ ఫోర్స్ అధికారులు సిహెచ్ రాజేశ్వర చారి, ఎండి నజీర్ హుస్సేన్‌లు సోమవారం జైనూర్, చోర్ పెళ్లి గ్రామాల్లో విచారణ చేపట్టారు. ముందుగా జైనూర్ వచ్చిన టాస్క్ ఫోర్స్ అధికారులు ఆదివాసి సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ కనకయాదవరావు వాంగ్మూలం తీసుకున్నారు. అసలు రైతుల నుండి ఏవరు తీసుకున్నారు అనే కోణంతో పూర్తిస్థాయివిచారణ కొనసాగిస్తున్నారు. అదేవిధంగా లింగపూర్ మండలంలోని లేండిగూడ బాధిత రైతులనుంచి, ప్రజల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరిస్తామని అటవి శాఖ టాస్క్ ఫోర్స్ అధికారులు రాజేశ్వర్ చారి, ఎండి నజిర్ హుస్సేన్ తెలిపారు . వారితో స్థానిక ఏప్ ఆర్వో జ్ఞానేశ్వర్, బీట్ ఆఫీసర్ హరిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీస్..

బెల్లంపల్లి, జూలై 15 : గుండెనొప్పితో బాధపడుతున్న వ్యక్తిని పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గమనించి వెంటనే దవాఖానకు తరలించి ప్రాణాలు కాపాడి శభాష్ పోలీస్ అనిపించుకున్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని తన ఇంటి ఎదుట అడిచర్ల మహేశ్ గుండె నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. అటువైపుగా పెట్రోలింగ్ కు వచ్చిన ఏఎస్ఐ మునీర్, డ్రైవర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్యలు అతడిని గమనించారు. 108 వాహనం రావడానికి ఆలస్యం అవుతుందని గ్రహించిన వారు వెంటనే వన్‌టౌన్ సీఐ దేవయ్యకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న దేవయ్య మహేశ్‌కు సీపీఆర్ చేశారు. అక్కడి నుంచి నేరుగా పోలీస్ వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులను వైద్యులు స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## స్థానిక కార్పెంటర్లను ఆదుకోవాలి

కాసిపేట, జూలై 15 : మంచిర్యాల జిల్లాలో బిల్డర్స్ కొత్తగా ఇల్లు కట్టుకునే వారు, ఇతర పనుల కోసం స్థానిక కార్పెంటర్లకు పని కల్పించి ఆదుకోవాలని మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ కార్పెంటర్స్ సంఘం నాయకులు గొల్లపల్లి రాజేందర్ చార్యులు కోరారు. లోకల్ కార్పెంటర్లకు అవకాశం ఇవ్వాలని, దర్వాజాలు, డోర్స్, కిటికీలు, కబోర్డ్ వర్క్ ఇంటికి, షాప్‌కు సంబంధించిన ఎలాంటి పనైనా మీకు అందుబాటులో ఉన్న కార్పెంటర్లకు పని ఇస్తే కొన్ని కార్పెంటర్స్ కుటుంబాలు బతుకుతాయన్నారు.

## జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రామకృష్ణాపూర్, జూలై 15 : మందమర్రి మండలం బొక్కలగుట్ట, క్యాతనపల్లి మున్సిపాలిటీ సరిహద్దులో జాతీయ రహదారి ప్రక్కన ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న గాంధారి మైసమ్మ ఆషాడమాస బోనాల జాతరను జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ సూచించారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మున్సి పల్ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీడీఓ రాజేశ్వర్‌రావు, ఎటీడీఓ చిరంజీవి, ఆర్.ఓ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్ రిమాండ్

రామకృష్ణాపూర్, జూలై 15 : అమాయక ప్రజలకు భూములు అమ్ముతూ డబ్బులు తీసుకొని తప్పుడు రిజిష్ట్రేషన్ చేస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ అమాయకపు ప్రజలను మోసం చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్న మూడు కేసులలో నిందితుడైన రౌడీ షీటర్ కూనారపు మల్లేష్‌ను సోమ వారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జి. రాజశేఖర్ తెలిపారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఇల్లు అమ్మి డబ్బులు తీసుకొని రిజి ష్ట్రేషన్ చేయకుండా, డబ్బులు ఇవ్వకుండా బెదిరించిన కేసు లో, రామాంజనేయులు అనే వ్యక్తికి భూమి రిజిష్ట్రేషన్ చేసి డబ్బులు తీసుకొని భూమి ఎక్కడున్నదో చూపెట్టకుండా తిప్పు తూ, తప్పుడు రిజిష్ట్రేషన్ చేసిన మరొక కేసులో నిందితుడైన క్యాతనపల్లి మున్సిపాలిటీలోని గద్దెరాగడికి కూనారపు మల్లేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా భూములు అమ్ముతాను అని డబ్బులు తీసుకొని తప్పుడు రిజిష్ట్రేషన్ చేసి అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ అమాయ కపు ప్రజలను బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజశేఖర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.